కథానిక

షోకాజ్



శేషు

సైకిల్ తొక్కుతున్నాను. ఆలస్యం అయింది. శక్తినంతా ఉపయోగించి సైకిల్ తొక్కుతున్నాను. టైం అయిపోతోంది. ఈ రోజు జరిగే 10వ తరగతి పరీక్షలో నాకు ఇన్విజిలేషన్ డ్యూటీ. ఇన్విజిలేషన్ డ్యూటీ వద్దనుకున్నా తప్పడంలేదు. అన్ని సబ్జెక్ట్స్ అప్పుడు తప్పినా, ఇంగ్లీషు, లెక్కల పరీక్ష లప్పుడు డ్యూటీ తప్పడంలేదు. ఈ రెండు పరీక్షలలో ఫెయిల్ అయ్యేవాళ్ళ సంఖ్య ఎక్కువ కావడాన, రాసే వాళ్ళ సంఖ్య ఎక్కువవుతూ వుంటుంది. పాతకొత్తల గొప్ప కలయిక...

కిరాయి తక్కువ కదా అని ఊరి చివర ఇల్లు తీసుకున్న నన్ను నేను తిట్టుకుంటూ సైకిల్ తొక్కుతున్నాను. సైకిల్ ముందుకు... ఆలోచనలు వెనక్కు....

* * *

మా ఊళ్ళో 10వ తరగతి పరీక్షలు నాలుగు సెంటర్లలో జరుగుతాయి. ఆ నాల్గింటిలో నేను పనిచేస్తున్న స్కూలు కూడా ఒక సెంటరు. మా సెంటర్‌కు పరీక్ష వ్రాయడానికి వచ్చే పిల్లలలో ఎక్కువ శాతం మారుమూల గ్రామాల్నుండి వచ్చేవాళ్ళే! గ్రామాలలో వుండే ఆ స్కూళ్ళలో, స్కూల్ అవసరాలకు సరిపోయే సబ్జెక్ట్ టీచర్లు వుండరు. ఉండే ఆ కొద్దిమంది టీచర్ల అవసరాలన్నీ జిల్లా ప్రజాపరిషత్ ఫైళ్ళలో ఎర్ర టేప్‌తో బంధింపబడి వుంటాయి. అందుకే వీలయితే టీచర్లు, వీలు కాకపోతే టీచర్ల ఆలోచనలు జిల్లా ప్రజా పరిషత్‌ఆ చుట్టూ తిరుగుతుంటాయి.

కనీసావసరాలు తీరని స్కూళ్ళల్లో సమస్యల సుడిగుండంలో వున్న టీచర్ల దగ్గర శిక్షణ పొందిన పిల్లలకు మా స్కూలొక పరీక్షా కేంద్రం. అటువంటి స్కూళ్ళనుంచి వచ్చిన పిల్లలలో బట్టీ పట్టినవి పరీక్షలో వస్తే రాసేవాళ్ళు కొద్దిమంది కాగా, అదృష్టాలపై నమ్మకంతో అవకాశాలమీద ఆశతో వచ్చే వాళ్ళు అధికులు. వంచిన తల ఎత్తనీయక, మెడలు తిప్పనీయక, నియమాలు నిబంధన లంటూ ఆ పిల్లల్ని నిర్బంధించడానికి, నియంతలా ప్రవర్తించడానికి నాకు మన సొప్పదు. అలాగని పరీక్ష రాసేవాళ్ళకి పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చి, పరీక్ష హాల్‌ను లైబ్రరీ చేయడం కూడా న్యాయం అనిపించదు. అందుకే ఇన్విజిలేషన్ డ్యూటీ నుంచి తప్పు కోవడానికి నేను ప్రయత్నిస్తాను. తప్పనిసరై వెళ్ళవలసి వస్తే, కట్టె విరగకుండా, పాము చావకుండా, పట్టు విడుపులతో 2 1/2 గంటలు గడిపి బైట పడుతుంటాను. ప్రతి సంవత్సరం జరిగేది అదే! ఈ సంవత్సరం ఎలా వుంటుందో! ఇంట్లో టిఫెన్ కాకపోవడాన హోటల్లో తిని రావడాన ఆలస్యం అయింది.

స్కూల్ దగ్గరకు వచ్చింది. తొక్కడం ఆపాను. గుండె దడదడ తగ్గలేదు.

హడావిడిగా స్కూల్‌కు వెళ్ళాను. పరీక్ష పేపర్లు తీసుకుని హాల్‌లోకి వెళ్ళాను. హాల్‌లో వున్న చల్లదనానికో, నా కంగారుకో చమటలు మొదలయ్యాయి.

* * *

"మీ దగ్గర ఏమన్నా కాగితాలుంటే ఇప్పుడే ఇచ్చే సెయ్యండి. ఆ తర్వాత మీ దగ్గర ఏమన్నా కనిపిస్తే కేస్ బుక్ అవుతుంది. 3, 4 సంవత్సరాలు డిబార్ అవుతారు. అనవసరంగా మీ భవిష్యత్ పాడు చేసుకోకండి..."

"పక్కవాడి దాంట్లో గాని, ముందువాడ దాంట్లో గాని చూసి రాయకండి. సొంతంగా ఎంత వస్తే అంతా రాయండి. చూసి రాసినవాడే కాదు, చూపించినవాడు కూడా డిబార్ అవుతాడు."

పరీక్ష హాల్‌లో నేను అనే బెదిరింపు మాటలవి.

అందరికీ పేపర్లు పంచేసి, ఇప్పుడు కూడా అనేస్తూ, వచ్చిన పిల్లల్ని పరిశీలించడం మొదలు పెట్టాను.

హాల్‌లో వున్న మొత్తం పిల్లలు పల్లెటూళ్ళనుంచి వచ్చినవాళ్ళే కాదు, కొంతమంది స్థానికులున్నారు. వీళ్ళల్లో బ్యాంక్‌లో పనిచేసే అటెండర్‌లు, టెలిఫోన్స్‌లో పనిచేసే లైన్‌మెన్‌లు, పోస్టాఫీసుల్లో పనిచేసే నాల్గవ తరగతి ఉద్యోగులు, స్టేట్ వేర్ హౌసింగ్‌లోను, స్కూళ్ళల్లోను పనిచేసే అటెండర్స్ వున్నారు. ఒకళ్ళిద్దరు నాకంటే పెద్దవాళ్ళు వున్నారు.

10వ తరగతి పాస్ అయితే రాబోయే ప్రమోషన్ గురించో, ఉద్యోగానికి దొరికే భద్రత గురించో వాళ్ళు పరీక్ష రాస్తున్నారు.

10వ తరగతి పాసయితే బ్యాంక్‌లో అప్పు కోసం దరఖాస్తు పెట్టుకునే అర్హతైనా దొరుకుతుందని నాలుగైదు సార్లుగా పరీక్ష రాస్తున్న ఆశాజీవి కూడా మా హాల్‌లో వున్నాడు.

హాల్‌లో అటూ ఇటూ తిరుగుతూ నాలుక చివర్నుండి ఏవో బెదిరింపు మాటలు మాట్లాడుతున్నాను. హాల్‌లో వున్న పిల్లల గురించే ఆలోచిస్తున్నాను.

చేస్తున్న వృత్తిలో సజీవ సంబంధం లేని చదువు మీద దృష్టి నిలవడం కష్టం. నేను డిపార్ట్‌మెంట్ పరీక్షలు వ్రాసిన రోజులు గుర్తుకొస్తున్నాయి. ఆ పరీక్షల్లో పాసయితే కాని ప్రమోషన్ ఇవ్వరని పరీక్షకు కట్టాను. చదువుదామని పుస్తకాలు తీస్తే, ఎంత ప్రయత్నించినా దృష్టి పుస్తకాల మీద నిలిచేది కాదు. చదవకుండా పరీక్ష పాసయ్యే మార్గాలు ఏవైనా వున్నాయేమోనని వెతికిన సందర్భాలు వున్నాయి. డిపార్ట్‌మెంట్ పరీక్షలు వ్రాసినప్పటి నా ప్రవర్తనను తలచుకుంటే నాకు చాలా ఆశ్చర్యంగాను, చాలా చిన్నతనంగాను అనిపిస్తోంది.

ఈ రోజు నేను పిల్లల్ని చెయ్యవద్దంటున్న పనిని ఆ రోజు నేను చేశాను.

హాల్‌లో అటు ఇటు తిరుగుతున్నాను నా ఆలోచనలు బుర్రలో తిరుగుతున్నట్లు.

నేను చేస్తేకాని తప్పు పిల్లలు చేస్తే ఎలా అవుతుంది?

అప్పటి నా ప్రవర్తన, ఇప్పుడు నేను విధిస్తున్న నియమాలతో ఘర్షణ పడుతోంది. ఆ ఘర్షణ నన్ను అచేతనుణ్ణి చేస్తోంది. హాల్‌లో ఏదేదో యాంత్రికంగా మాట్లాడుతున్నాను. నా మనస్సుకు, నా మాటలకు పొంతన లేదు. స్తబ్దత... నేను చూస్తున్నదొకటి, నాకు జ్ఞాపకం వస్తున్నది మరొకటి. నేను అనుకుంటున్నదొకటి, అంటున్నది మరొకటి. నేను వింటు న్నదొకటి, వినబడుతున్నది మరొకటి.- నా జ్ఞానేంద్రియాలకు, మెదడుకు మధ్య సంబంధాలు తెగిపోతున్నాయేమో! నా చర్యలన్నీ అనియంత్రితాలవుతున్నాయి.

నాలోని స్తబ్దతను గమనించినట్టున్నారు పరీక్ష వ్రాస్తున్నవాళ్ళు. నెమ్మదిగా వాన పాముల్లా సాగుతున్నారు. పుట్టగొడుగుల్లా చిన్న చిన్న కాగితాలు పుట్టుకొస్తున్నాయి. నేను గమనిస్తున్నాను. గమనించనట్టే నటిస్తున్నాను.

దరిమిలా ఆలోచనలు వెంటపడుతున్నాయి.

'తప్పు చేస్తున్నానా? చదివి పరీక్ష రాసేవాళ్ళకి అన్యాయం చేస్తున్నానా?' నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

'ఆ! ఏం అన్యాయం? వీళ్ళు పరీక్ష రాస్తున్నది ఊళ్ళేలడానికి కాదు. సర్టిఫికెట్లు పట్టుకుని ఊరేగడానికి కాదు. ఏదో పాస్ అయినట్టు సర్టిఫికెట్ తెచ్చుకుంటే జరుగుతుందనుకుంటున్న కొద్దిపాటి లాభంపై ఆశ! తప్పేం లేదు' సమాధానపడ్డాను.

వీళ్ళు పాసైతే కొద్దిపాటి లాభం వీళ్ళకు. నష్టం ఎవ్వరికీ లేదు. వీళ్ళు ఫెయిలైతే లాభం ఎవరికీ లేదు. వీళ్ళకు మాత్రం నష్టం. ఎవ్వరికీ నష్టం లేకుండా, వీళ్ళకి లాభం జరిగేటట్టుంటే చూసీ చూడనట్టుంటే తప్పేంటి?' తర్కించుకున్నాను.

వదిలెయ్యడం తప్పా? పట్టుకోవడం తప్పా? తేలడం లేదు. చెరువులో పడ్డ ఈతరానివాడిలా, ఉక్కిరిబిక్కిరి నేను ఆలోచనలలో పడి.

ఒక్క పదినిమిషాలలో రెండున్నర గంటలు గడిచిపోతే బావుండును.

నిశ్శబ్దంగా వుంటే రకరకాల ఆలోచనలు ముసురుకుంటాయి. నిశ్శబ్దాన్ని భరించలేకపోతున్నాను నేను. నిశ్శబ్దాన్ని తరిమెయ్యడానికి ఏదో మాట్లాడేస్తున్నాను.

చేతులు వెనక్కి పెట్టుకుని, హాల్‌లో అటూ ఇటూ తిరుగుతూ నాలుక చివరినుంచి బెదిరింపు మాటలంటున్నాను నేను. వాతావరణాన్ని సీరియస్ చేయడానికి అవే బెదిరింపు మాటల్ని ఇంగ్లీషులో అంటు న్నాను.

చేతులు వెనక్కి పెట్టుకుని హాల్‌లో అటూ, ఇటూ తిరుగుతూ అప్పుడప్పుడు బెదిరింపు మాటలంటున్న నన్ను ఇప్పుడెవరన్నా చూస్తే ఏకపాత్రాభినయం చేస్తున్న నటుడిలా కనిపిస్తాను కాని, పరీక్ష హాల్‌లో డ్యూటీ చేస్తున్న ఇన్విజిలేటర్‌గా కనిపించను.

* * *

లంచం ఇచ్చినా పని పెండింగ్‌లో వుంటున్న ఈ రోజులలో లంచం తీసుకుని వెంటనే పనిచేసేవాడిని 'నిజాయితీపరుడు' అని ఎక్కువమంది భావిస్తారు. అలా భావించే ఎక్కువమంది దృష్టిలో శాస్త్రి నిజాయితీ పరుడు. శాస్త్రి ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్. వారు అడిగిన మొత్తం, బేరం ఆడకుండా మనం ఇస్తే, మనం అడిగిన దెటువంటి పనైనా వారు చేస్తారు. చేయిస్తారు. ఎల్.టి.సి. పేరు మీద ఏ ప్రాంతం వాళ్ళు ఏ ప్రాంతానికి వెళ్తే ఎక్కువ డబ్బు క్లెయిమ్ చేయడానికి అవకాశం వుందో చెప్పగలగడమే కాదు, టిక్కెట్లు సంపాదించి కూడా ఇవ్వ గలరు. అన్ని విషయాలలోను వారు టీచర్లకు, ఎస్.టి.ఓ.కు మధ్య వారధిగా నిలబడతారు. ఎస్.టి.ఓ. ఆఫీసుకు వెళ్ళే 'పై కాగితాలకే' కాక 'క్రింది కాగితాలకు' కూడా వీరొక ప్రాపర్ ఛానెల్. 'లంచం-కాలం-పని' లెక్కల్లో వీరు నిష్ణాతులు. ఉన్నతాధికారుల నాడిని కూడా వీరు చాలా సులభంగా, తొందరగా పట్టెయ్యగలరు. ఏం చేస్తే అధికారుల దృష్టిలో 'ఆదర్శ ఉపాధ్యాయులుగా' అనిపించుకోవచ్చునో అంచనా వేయగలరు. వీరు ఆదర్శ ఉపాధ్యాయులుగా సన్మానం పొందని సంవత్సరం లేదు. వీరినే ఆదర్శంగా తీసుకుని, అందరు ఉపాధ్యాయులు ప్రవర్తిస్తే 'విద్యాసంస్థల' భవిష్యత్ ఎలా వుంటుందో అని ఆందోళన చెందే ఉపాధ్యాయులు కొందరు లేకపోలేదు.

అటువంటి శాస్త్రి పర్యవేక్షణలో జరుగు తున్నాయి ఈ పరీక్షలు. పరీక్షల్లో పిల్లలు కాపీ రాయకూడదని శాస్త్రి కోరుకోరు. పిల్లలు కాపీ రాస్తుండాలి. రాస్తుండగా తాను పట్టు కోవాలి. ఎక్కువమందిని డిబార్ చేసిన సెంటర్‌గా మా స్కూలూ, చీఫ్ సూపరింటెండెంట్‌గా తానూ పేరు గడించాలని చూస్తారు. అందుకే ఆయన, సొంతంగా పరీక్ష వ్రాసే పిల్లలకంటే కాపీ రాస్తూ పట్టుబడే పిల్లలే అధికంగా వుండాలని కోరుకుంటారు. కాపీ చేస్తూ పట్టుబడ్డ పిల్లలు ప్రాధేయపడు తున్నప్పుడు, కంట కన్నీరు పెట్టినప్పుడు సంతోషాన్ని, గర్వాన్ని పొందే శాడిస్టు మా శాస్త్రి...

దీపాల దగ్గర పురుగుల కోసం పొంచిన బల్లిలాగ, ఎలుకల వేటలో నిలిచిన పిల్లిలాగ, నిశ్శబ్దంగా మా హాల్ కిటికీ దగ్గర శాస్త్రి నిలబడ్డారు.

నేనది గమనించలేదు. పరీక్ష రాస్తున్న పిల్లలు గమనించారు. కాని ఆలస్యం అయింది.

* * *

శాస్త్రి హాల్లోకి దూసుకొచ్చారు. కొంత మంది పిల్లలు సర్దుకున్నారు. కంగారుపడ్డ కొద్దిమందిలో ఇద్దరు దొరికిపోయారు. శాస్త్రి ఉత్సాహంతో గాలించారు. మరో ఇద్దరు దొరికారు. హాల్లో చిందులు తొక్కారు శాస్త్రి.

విజయగర్వంతో శాస్త్రి, నలుగురి పరీక్ష పేపర్లు పట్టుకుని అటెండర్, వీళ్ళవెంట ప్రాధేయపడుతూ నలుగురు పిల్లలు, మా హాల్ నుంచి ఆఫీస్‌వేపు వెళ్ళారు. వెళ్ళే ముందు శాస్త్రి కనుబొమ్మల్ని ముడి పెట్టుకుని, కళ్ళను చిట్లిస్తూ, కిందినుంచి పైదాకా నన్నొకసారి చూసి మరీ వెళ్ళారు శాస్త్రి. శాస్త్రి వెళ్తుంటే అన్ని రూముల్లో వున్న ఇన్విజిలేటర్లు బైటికొచ్చి చూస్తున్నారు. తల తిప్పకుండా గుడ్లని గిరగిర తిప్పుడూ అందర్నీ గమనిస్తూ ఆఫీస్‌వైపు వెళ్ళారు శాస్త్రి. ఆఫీసులో హడావిడి, మిగిలిన పరీక్ష హాళ్ళల్లో అలజడి. మా హాల్లో మాత్రం తుఫాన్ వెలిసినప్పటి ప్రశాంతత.

* * *

తన సీటు దగ్గర దొరికిన కాగితాలు తనవి కావని ఒకరు వాదించారట.

తాను ఆ కాగితం అసలు రాయలేదని, ఆ ప్రశ్న అసలు పరీక్షలోనే రాలేదని మరొకరన్నారట.

ఈ ఒక్కసారి వదిలెయ్యండి. ఈ సంగతి మా నాన్నకు తెలిస్తే, చంపేస్తారని మరొకతను ఏడుస్తూ ప్రాధేయపడ్డాడట. ఎవరెన్ని విధాల ప్రయత్నించినా, ప్రాధేయ పడినా, శాస్త్రి చలించలేదు. వారి పట్టుదల సడలలేదు. నలుగురిపైన కేసు నమోదుచేసి, కానిస్టేబుల్‌ని పిలిచి ఆ నలుగురిని బైటికి పంపించారట.

ఇది ఎప్పుడూ జరిగేదే! ఇలా జరుగు తుందని అనుకున్నదే! తర్వాత జరిగిన సంఘటన నేను ఊహించనిది.

ఒక్క క్షణం ఆ సంఘటన నాలో ఆశ్చర్యాన్ని కలిగించింది. రిలీవర్‌ను పంపించి నన్ను పిలిపించారు శాస్త్రి. పిలిపించి నా చేతిలో ఒక కాగితం పెట్టారు. చదివాను నేను.

'నేను బాధ్యతారహితంగా, నిర్లక్ష్యంగా ప్రవర్తించడమే రూంలో మాస్ కాపీలు జరగ డానికి కారణమని, దానికి నాపై ఎందుకు క్రమ శిక్షణ చర్యను తీసుకోకూడదో తెలియ జేయమంటూ వ్రాసిచ్చిన షో కాజ్ నోటీస్ అది...

రెండు మూడుసార్లు చదివాను ఆ షో కాజ్ నోటీసును. ఆలోచిస్తున్నాను, ఏమని సమాధానం రాద్దామని కాదు, 'పిల్లలు కాపీ రాయడానికి కారణం నేనేనా?' అని. పరీక్ష హాల్లో మూడు గంటల నా ప్రవర్తనే పిల్లలు కాపీ రాయడానికి కారణం అయిందా? అని.

అవుననిపించడం లేదు.

విసిరేసినట్టుగా వున్న మారుమూల గ్రామాల్నుండి వచ్చిన పిల్లలు వాళ్ళు. చెట్టే గాని, గదులు లేని స్కూల్ వాళ్ళది.

హ్రస్వ దృష్టి, గల అధికారులకు దూరంగా వున్న స్కూల్ అవసరాలు కని పించవు. అందుకే అధికారుల దృష్టినుంచి వెలివేయబడ్డవి గ్రామాలలో వున్న స్కూళ్ళ అవసరాలు. ఆ స్కూళ్ళల్లో పనిచేసే టీచర్ల అవసరాలు.

టీచర్ల పరిస్థితి, స్కూళ్ళ పరిస్థితి అలా వుంటే పిల్లల పరిస్థితి ఎలా వుంది?

పట్టణాలలో చదువు 'కొన'లేనివాళ్ళు గ్రామాలలో వున్న స్కూళ్ళల్లో వుంటారు. దరిద్ర రేఖ దిగువ భాగాన వున్న కుటుంబాల నుంచి వచ్చినవాళ్ళు గ్రామాలలో వున్న ఈ విద్యార్థులు. వీళ్ళ నిత్య జీవితాలలో ఎదు రయ్యే ఏ సమస్యకు సమాధానం పుస్తకాలలో కనిపించదు. స్వతంత్రంగా ఆలోచించే స్వభావాన్ని మొగ్గలోనే తుంచేసే స్వభావం గల ఈ చదువు వల్ల వీళ్ళు దృష్టిని కేంద్రీక రించగలుగుతారా? కేంద్రీకరించేటట్టు అక్కడి స్కూళ్ళు గాని, టీచర్లు గాని చేయ గలుగుతారా?

గ్రామాలు, స్కూళ్ళు, టీచర్లు, పిల్లలు, చదువు, ఇవన్నీ ఎటువంటి వాతావరణంలో వున్నాయి? పాములే గాని, నిచ్చెనలు లేని వైకుంఠపాళిలో వున్నాయి. బ్యాంక్‌లో పని చేసే అటెండర్‌లకు, పోస్టాఫీస్‌లలో పనిచేసే నాలుగవ తరగతి ఉద్యోగులకు, టెలిఫోన్ ఎక్స్చేంజిలో పనిచేసే లైన్‌మెన్‌లకు 10వ తరగతి పుస్తకాలలో వున్న ఏ విషయం వాళ్ళ వృత్తికి తోడ్పడుతుంది?

అప్పుకోసం దరఖాస్తు పెట్టుకోవడానికి, 10వ తరగతి పాస్ కావడానికి వున్న సంబంధం ఏమిటి?

ఇటువంటి అస్తవ్యస్తమైన వాతావరణాన్ని కల్పించిన ప్రభుత్వం చేస్తున్న తప్పుతో పోల్చితే, పరీక్ష హాల్‌లో పిల్లలు చేసిన తప్పెంత? పిల్లలు చిన్న కాగితం పెట్టి రాస్తుంటే చూసీ చూడనట్టుగా వున్న నా తప్పెంత?

ఆలోచించాను. రాస్తున్నాను.

'ఎవరైనా తప్పు చేస్తే, ఆ తప్పు కేవలం వారిది మాత్రమే కాదు. వారిని తప్పు దారిన నడిపించిన వాతావరణానిది. వాతావరణాన్ని సరిచేయని బాధ్యులది. అంటే ప్రభుత్వానిది. అందుకే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను...

కాపీ రాస్తున్న పిల్లల్ని డిబార్ చేయడంలో చూపుతున్న శ్రద్ధ, పిల్లలు చదువుకోవడానికి వీలైన వాతావరణాన్ని కల్పించడంలో ఎందుకు చూపడం లేదు?' అని.

'నిరాయుధులైన అభిమన్యులపై ఆయుధాలు సంధించడంలో గల న్యాయం ఏంటో తెలియజేయమని' ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ నేనొక 'షో కాజ్' నోటీసు జారీ చేస్తున్నాను.